విత్తుకున్న మత్తు!





పలమనేరు మండలంలోని అటవీ సమీప పొలంలో సాగైన గంజాయి(ఫైల్), గతేడాది చెత్తపెంట వద్ద పోలీసులు సీజ్ చేసిన గంజాయి పంట(ఫైల్)

- బంతి తోటల్లో రహస్యంగా గంజాయి సాగు
- పట్టణ ఆవాస ప్రాంతాల్లోనూ మొలిచిన మొక్కలు
- అటవీ సమీప గ్రామాల్లో వాడకానికి గంజాయి సాగు

పలమనేరు: గత కొన్నేళ్లుగా పలమనేరు డివిజన్‌లో గంజాయి మత్తు పెరుగుతోంది. ఇందుకు అలవాటు పడినవారు దానికి బానిసలుగా మారిపోతున్నారు. ఈ ప్రాంతానికి ఇచ్ఛాపురం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల నుంచి పలు మార్గాల్లో గంజాయి అక్రమంగా చేరుతోంది. విశాఖ ప్రాంతం నుంచి బెంగళూరుకు వెళ్లే మార్గంలో పలమనేరు ఉండడంతో ఇక్కడి గంజాయి విక్రేతలకు సరుకు బాగా అందుతోంది. వీటిని రహస్యంగా విక్రయించే ఏజెంట్లు పదుల సంఖ్యలో ఉన్నారు. దీంతో గంజాయి పీల్చేవాళ్లు వాడి పడేసిన గంజా విత్తనాలు వర్షాలకు మొలకెత్తి మొక్కలుగా మారుతున్నాయి. ఇంకొందరు బంతి తోటల్లో సైతం అనుమానం రాకుండా అక్కడక్కడ వీటి విత్తనాలను సాగుచేస్తున్నట్టు తెలుస్తోంది. ఇవి అదునుకొచ్చాక గంజాకు అలవాటు పడినవారు ఎక్కడో రహస్యంగా కొనే పనిలేకుండా వీటిని వాడుకోవడం జరుగుతోంది.



బంతిమొక్కలలాగే కనిపించే గంజాయి బంతితోట

గతంలోనూ పలుమార్లు దాడులు..

ఈ ప్రాంతంలో గంజాయి సాగు ఉందని తెలుసుకున్న పోలీసులు, ఎక్సైజ్ అధికారులు మూకుమ్మడిగా పలుచోట్ల దాడులు చేసి వీటిని సీజ్ చేసిన సందర్భాలున్నాయి. గతంలో పలమనేరు మండలంలోని చెత్తపెంట గ్రామం వద్ద ఓ వ్యక్తి పండించిన గంజాయి మొక్కలను అధికారులు సీజ్ చేసి నిందితునిపై కేసు నమోదు చేశారు. అంతకుముందు వి.కోట మండలంలోనూ గంజాయి మొక్కలను అధికారులు గుర్తించి సీజ్ చేశారు.

పట్టణ ఆవాసాలు, అటవీ సమీప గ్రామాల్లో..

పలమనేరు, పుంగనూరు, వి.కోట లాంటి పట్టణాల్లో గంజాయి మత్తుకు బానిసలైనవారున్నారు. వీరికి అందిన గంజాను పట్టణ ఆవాస ప్రాంతాల్లో జనం ఎక్కువగా సంచరించిన ప్రాంతాలను గుర్తించి అక్కడ పీల్చుతుంటారు. దీంతోపాటు కొన్ని దాబాల వెనుక భాగాలు, వారపుసంతలు, పాడుబడ్డ భవనాలు, పట్టణాలకు దూరంగా ఉన్న బంగ్లాలు, పురాతన ఆలయాల వద్ద వీరు పీల్చుతుంటారు. అక్కడ తాగి పడేసిన గంజాయి విత్తనాలు పడి ఉంటాయి. ఇవి వర్షాలకు మొలకెత్తి అక్కడ మొక్కలు మొలుస్తున్నాయి. ఇక అడవులకు ఆనుకొని ఉన్న గ్రామాలు ఈ రెవెన్యూ డివిజన్‌లోనే 30 దాకా ఉన్నాయి. ఈ గ్రామాల్లో పెద్దగా పోలీసుల జాడ ఉండదు. మత్తుకు అలవాటు పడినవారు గంజాయి మొక్కలను రహస్యంగా సాగు చేస్తున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా పలమనేరు మండలంలోని బయ్యప్పగారి పంచాయతీ, జగమర్ల, బైరెడ్డిపల్లి, వి.కోట, చౌడేపల్లి, సోమల మండలాల్లోని అటవీ సమీప గ్రామాల్లో అక్కడక్కడ గంజాయి మొక్కలున్నట్టు తెలిసింది.

ఎన్నికల కారణంగా పట్టించుకోలేదు...

గతంలో ఎన్నికలు రావడంతో అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. ఆపై రాష్ట్రంలో కొత్త కూటమి ప్రభుత్వం వచ్చింది. ఇటీవల అన్నిశాఖల్లోనూ అధికారుల బదిలీలు జరిగాయి. దీంతో శాఖాపరమైన విధులపట్ల ఆయా శాఖలు పూర్తిస్థాయిలో దృష్టిని సారించని పరిస్థితి ఏర్పడింది. దీన్ని ఆసరాగా చేసుకొని అక్రమార్కులు గంజామొక్కల పెంపకాలు, గంజాయి విక్రయాలను స్థానికంగానే చేపడుతున్నట్టు సమాచారం. ఇకనైనా అధికారులు గంజా సాగుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

జగన్ పర్యటనను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప

- మాజీ ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు: పట్టణంలో చిన్నారి అశ్వియ అంజుమ్(7) హత్యకు గురికావడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 9న పుంగనూరుకు వస్తున్నారని మాజీ ఎంపీ రెడ్డెప్ప తెలిపారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నాగభూషణం, పీకేఎం ఉడా మాజీ చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫకృద్ధిన్‌షరీఫ్‌తో కలసి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. రెడ్డెప్ప మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఉదయం 10 గంటలకు పుంగనూరు సమీపంలోని బైపాస్‌రోడ్డు వద్ద గల హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డితో కలసి బాధిత కుటుంబం ఇంటి వద్దకు చేరుకుని వారిని పరామర్శిస్తారని తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, జగనన్న అభిమానులు అధిక సఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి చంద్రారెడ్డి యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు చెంగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ వేమన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ నాగేంద్ర, కౌన్సిలర్లు అమ్ము, కిజర్‌ఖాన్, జేపీ.యాదవ్, రేష్మ, సాజిదాబేగం, రాఘవ, నటరాజ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

పలమనేరు: పలమనేరు ఎక్సైజ్ పరిధిలోని 13 ప్రైవేటు దుకాణాలకు ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చునని స్థానిక ఎక్సైజ్ సీఐ భాగ్యలక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మీసేవా కేంద్రాలు, నెట్ సెంటర్లలోనూ లేదా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 040–42425520 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

బాసటగా నిలిచిన స్నేహితులు



ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

సదుం: మండల కేంద్రంలోని బలిజవీధికి చెందిన మునిరాజా గత కొన్నిరోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. స్నేహితుడి అస్వస్థత సమాచారం తెలుసుకున్న 1993–94 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు స్పందించారు. అతనికి ఆదివారం రూ.44, 500 నగదు, నిత్యావసర వస్తువులను అందజేశారు. హేమలత, నాగేశ్వారెడ్డి, అబీద్, సిలార్ పాల్గొన్నారు.

శక్తిస్వరూపిణీ.. నమో నమామి!



బోయకొండలో..



మేలుమాయిలో..



కల్లూరులో..



రొంపిచెర్లలో..



పుంగనూరులో..



పుంగనూరులో..



రామకుప్పంలో..



పెద్దపంజాణిలో..



వి.కోటలో..



పలమనేరులో..

- అన్నపూర్ణాదేవిగా బోయకొండ గంగమ్మ

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాల్లో భాగంగా మూడవ రోజైన ఆదివారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు కటాక్షించారు.

సదుంలో..

సదుం: సదుమమ్మ, జాండ్రపేట రామలింగ చౌడేశ్వరీదేవి, రెడ్డివారిపల్లె చామంతుల ఎల్లమ్మ ఆలయాల్లో ఆదివారం అభిషేకాలు, పూజలు చేశారు. బూరగమంద పచ్చార్లమాకులపల్లె గంగాపురమ్మ ఆలయంలో హోమాలు, చేశారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: ఎస్సీ కాలనీలో వెలసిన శ్రీ సల్లాపురెమ్మ ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, బాటగంగమ్మ ఆలయాల్లో పూజలు చేశారు.

గంగవరంలో..

గంగవరం: మేలుమాయి క్రాస్‌లోని శ్రీ మలాలమ్మ అమ్మవారు ధాన్యలక్ష్మి దేవిగా భక్తులను కటాక్షించారు. జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

కల్లూరులో..

కల్లూరు(పులిచెర్ల): కల్లూరులోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



సదుంలో హోమాలు



బైరెడ్డిపల్లెలో..

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: స్థానిక ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారు లలిత త్రిపురసుందరిదేవి అలంకరణలో భక్తులను కటాక్షించారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలోని శ్రీభోగనంజుండేశ్వరి స్వామి ఆలయంలోని శ్రీపార్వతిదేవిని, శ్రీవిరూపాక్షి మారెమ్మను అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు.

రామకుప్పంలో..

రామకుప్పం: స్థానిక వాసవీ ఆలయంలో అమ్మవారు గౌరీదేవీ అలంకారంలో దర్శనమిచ్చారు. రామకుప్పం, ఆనిగానూరు కన్యకాపరమేశ్వరీ ఆలయాల్లో వాసవీ అమ్మవారికి విశిష్ట అలంకరణ చేశారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండలంలోని శివాడి గ్రామంలో వెలసిన కాళికాదేవి లలితత్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

వి.కోటలో..

వి.కోట: పట్టణంలోని దుర్గానగర్‌లో వెలసిన శ్రీ దుర్గామాత, వాసవిమాత ఆలయంలో అమ్మవారిని అర్ధపూర్ణాదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

పలమనేరులో..

పలమనేరు: స్థానిక దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకారంతో దర్శనమిచ్చారు. పాతపేటలోని దదుర్గమ్మ ఆలయ పూజల్లో స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

అడ్డుగా ఉన్న చెట్లు తొలగించాం

చౌడేపల్లి: మండలంలోని చిట్రెడ్డిపల్లె సమీపంలోని సబ్‌స్టేషన్ ఆవరణలోగల చెట్లను లేన్లకు అడ్డుగా ఉన్న వాటిని తొలగించామని ట్రాన్స్‌కో ఏఈ శశిధర్ ఆదివారం తెలిపారు. ఈనెల 5న సాక్షిలో సబ్‌స్టేషన్‌లో చెట్లు మాయం అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అడ్డుగా ఉన్న చెట్లను మాత్రమే తొలగించామని పేర్కొన్నారు.

47 మందికి కంటి పరీక్షలు



ఆపరేషన్లకు ఎంపికైన వారితో వైద్యులు

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం మహతీ ఫౌండేషన్ వారి సహకారంతో కుప్పం పీఈఎస్ వైద్యులు నిర్వహించిన వైద్యశిబిరంలో 47 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఐదుగురిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కుప్పం పీఈఎస్ వైద్యాధికారులు, మహతీ ఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆలయ పనుల పరిశీలన



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: మండలంలోని నెర్నిపల్లి వద్ద నూతనంగా నిర్మిస్తున్న చౌడేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణ పనులను ఆదివారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఎన్నో ఏళ్లుగా భక్తుల కలగా మిగిలిన చౌడేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం కావడం హర్షించదగ్గ విషయంగా కొనియాడారు. నాణ్యతతో కూడిన పనులు చేయాలని కోరారు. శాంతిపురం జెడ్పీటీసీ శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ చిన్నన్న, మిట్టూరు ప్రకాష్, హరి పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలిన గణపయ్యలు



నిమజ్జన ఊరేగింపులో యువత సందడి

పలమనేరు: పట్టణంలోని జిలానీ క్రాస్‌లో వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన బొజ్జగణపయ్య విగ్రహాన్ని నిర్వాహకులు ఆదివారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, భారీ బాణసంచా, యువకుల కేరింతల నడుమ నిమజ్జనం సాగింది. దీంతో పట్టణంలోని అన్ని విగ్రహాలు నిమజ్జనానికి తరలాయి.

ప్రశాంతంగా టెట్ పరీక్ష



అభ్యర్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

పలమనేరు: పట్టణ సమీపంలోని మదర్‌థెరీసా ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం టెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని మూడు కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఆమేరకు స్థానిక సెంటర్‌లో పరీక్షకు ముందుగానే అక్కడి అధికారులు అభ్యర్థుల హాల్ టికెట్లను పరిశీలించి ఆపై హాలులోకి పంపారు. ఇక్కడి కళాశాల యాజమాన్యం ఇందుకు అవసరమైన ఏర్పాట్లను చేసింది.

సమగ్ర శిక్ష సిబ్బందికి జీతాలు చెల్లించండి

బంగారుపాళెం: సమగ్ర శిక్ష సిబ్బందికి జీతాలు చెల్లించాలని జిల్లా సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ జేఏసీ అధ్యక్షుడు కృష్ణమూర్తి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. విద్యాశాఖకు సంబంధించి సమగ్ర శిక్ష విభాగం కింద పనిచేస్తున్న ఎంఐఎస్, డేటా ఎంట్రీ, సీఆర్‌ఎంటీ, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్, మెసెంజర్స్, ఐఈఆర్‌పీలు, డీపీఓ ఆఫీస్ సిబ్బంది, కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి గత రెండు నెలలుగా జీతాలు అందక అవస్థలు పడుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా జీతాలు చెల్లించాలని కోరారు.

మద్యం దుకాణాలకు మూడు రోజులే గడువు

చిత్తూరు అర్బన్: జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాల నిర్వహణ కోసం దరఖాస్తు చేసుకోవడానికి మూడు రోజులు మాత్రమే గడువు ఉంది. దీనిపై ఆదివారం చిత్తూరు జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ 104 మద్యం దుకాణాలకు ఇప్పటికే దరఖాస్తులు ఆహ్వానించామన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండింటిలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లాలో ఎక్కడి నుంచి ఏ దుకాణానికైనా అప్లికేషన్ పెట్టుకోవచ్చని, రూ.2 లక్షల నాన్ రిఫండబుల్ డీడీ తప్పనిసరన్నారు.



బాలాజీనాయుడుతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వెంకటేగౌడ





మండిపేటకోటూరు గ్రామస్తులతో పెద్దిరెడ్డి, మోహన్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

పరామర్శ

పలమనేరు: పలమనేరు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాలాజీనాయుడును మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం మండిపేటకోటూరులోని ఆయన స్వగృహంలో పరామర్శించారు. ఇటీవల బాలాజీనాయుడు రోడ్డుప్రమాదానికి గురై వేలూరు సీఎంసీలో ఆపరేషన్ చేసుకొని వచ్చిన విషయం తెలిసిందే. ఆరోగ్యం కుదటపడినందున ఇకపై రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉండాలని ఆయనకు పెద్దిరెడ్డి సూచించారు. పార్టీ క్యాడర్‌కు తాము ఎల్లవేళల అండగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పెద్దిరెడ్డిని కలసి సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, నేతలు బైరెడ్డిపల్లి క్రిష్ణమూర్తి, మురళీకృష్ణ, చెంగారెడ్డి, రాజారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గంగవరం: గంగవరం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి మూడు నెలల క్రితం రోడ్డుప్రమాదంలో గాయపడ్డారు. ఆయన మూడు నెలల నుంచి ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం మోహన్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన్ని పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, బైరెడ్డిపల్లి క్రిష్ణమూర్తి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జాఫర్, ఆస్పత్రి కమిటీ మాజీ చైర్మన్ చెంగారెడ్డి, నాయకులు చంద్రప్ప పాల్గొన్నారు.

జిల్లాలో చెస్ అభివృద్ధికి కృషి



ప్రసాద్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు, నగరవాసులు

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చెస్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఏపీ చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఆర్‌బీ ప్రసాద్ అన్నారు. ఆదివారం నగరంలోని విజ్ఞానసుధ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ప్రసాద్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా అభినందన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతం కంటే ప్రస్తుతం చెస్ క్రీడకు ఆదరణ పెరిగిందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను చెస్ క్రీడ వైపు ప్రోత్సహించాలని చెప్పారు. ఏపీ చెస్ అసోసియేషన్ రాష్ట్ర పదవి రావడం రాయలసీమకే మొదటిసారి అని తెలిపారు. యువతకు చెస్‌పై మక్కువ కలిగించేలా విరివిగా క్యాంపులు నిర్వహిస్తామన్నారు. విజ్ఞానసుధ కళాశాల చైర్మన్ శ్రీధర్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే చెస్‌పై విద్యార్థుల్లో ఆసక్తిని పెంచాలన్నారు. ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, జ్ఞాపకశక్తి చదరంగం క్రీడతో పెరుగుతాయన్నారు. అనంతరం పలువురు ప్రముఖులు ప్రసాద్‌ను దుశ్శాలువాలు, గజమాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నగరవాసులు మండీ సుధ, కాజూరు బాలాజీ, ఆదినారాయణ, బాలు సోమనాథ్, కృష్ణకిశోర్, సునీల్, గిరి తదితరులు పాల్గొన్నారు.



గురువులతో పూర్వవిద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

రొంపిచెర్ల: స్థానిక ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వవిద్యార్థులు 23 ఏళ్ల తర్వాత రొంపిచెర్ల నాగిరెడ్డి కల్యాణ మండపంలో ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అలాగే 1991వ సంవత్సరంలో 10వ తరగతి చదువుకుని కష్టాల్లో ఉన్న సహచార విద్యార్థులకు తమ వంతు సాయం చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. జబర్దస్త్ ఆర్టిస్టులు వినోదిని, కార్తీక్, రమేష్ పూర్వ విద్యార్థుల సమావేశానికి ఆహ్వానించారు. వారు పూర్వ విద్యార్థులందరిని అలరించారు. విద్యార్థులు ఒకరికొకరు బాల్యాన్ని గుర్తు చేసుకున్నారు.

ముస్లింలు ఐక్యంగా ఉండాలి



ముస్లింల ర్యాలీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): అన్ని రంగాల్లో ముస్లిం సమాజం అభివృద్ధి చెందాలంటే ఐక్యంగా పోరాడాలని ముస్లిం ఐక్యవేదిక నాయకులు చిత్తూరు నగరంలో కదం తొక్కారు. ఆదివారం ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేశారు. అనంతరం నగరంలోని ఉర్దూ షాదీఖానాలో ముస్లిం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాఫర్‌వలి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ముక్కలుగా ఉన్న ముస్లిం సమాజాన్ని ఒక్కటి చేస్తూ, రాజకీయ పార్టీలకు, జమాతులకు అతీతంగా ముస్లిం ఐక్యవేదిక పని చేస్తుందన్నారు. సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఖలీల్ సయ్యద్, సెక్రటరీ సయ్యద్‌నూర్, ఉపాధ్యక్షుడు రషీద్, జిల్లా కార్యదర్శి ఇనయతుల్లా, తిరుపతి జిల్లా అధ్యక్షుడు నిజాముద్దీన్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దుర్యోధన వధ



తలపడుతున్న భీమ, దుర్యోధన పాత్రధారులు

సదుం: మండలంలోని భట్టువారిపల్లె కావమ్మ, మారయ్య ఆలయం వద్ద నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం నిర్వహించిన దుర్యోధన వధ భక్తులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం హరికథా భాగవతారణి జ్యోత్స్న దుర్యోధన వధ ఘట్టాన్ని హరికథ రూపంలో భక్తులకు వివరించారు. అనంతరం వెంకటేశ్వర నాట్య కళామండలి ఆధ్వర్యంలో భీమ, దుర్యోధన పాత్రదారులు యుద్ధ ఘట్టాలను ప్రదర్శించారు. దుర్యోధనుడు యుద్ధం అనంతరం మడుగులో దాక్కొని ఉండగా భీముడు అతనని బయటకు రప్పించి, శ్రీకృష్ణుని సాయంతో అంతమొందిస్తాడు. వీటిని పాత్రధారులు పద్యాలతో రక్తి కట్టించారు. దుర్యోధన ప్రతిమ మట్టికోసం భక్తులు ఎగబడ్డారు. అంతకుముందు పాండవుల విగ్రహాలకు పూజలు నిర్వహించారు. తిలకించేందుకు సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచారు. పెద్దిరెడ్డి లక్ష్మరెడ్డి జ్ఞాపకార్థం పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారతం దుర్యోధన వధతో ముగిసింది. కామల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఆనంద, రామాంజులు, మనోహర్‌రెడ్డి, భాస్కర్ రాజు, చిన్నరమణ, రాజశేఖర్, దాము పాల్గొన్నారు.